సాక్షి
మంచిర్యాల
శనివారం : 24 : జూన్ : 2023



పర్యాటకులకు చేరువగా..

పర్యాటక రంగంపై అటవీ శాఖ దృష్టి సారించింది. మూడు సఫారీలు, ఆరు కాట్టేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. రూ.50లక్షలతో కాట్టేజీల పనులు ప్రారంభించింది. 10లో▸



రైతుల సాగుబాట

మంచిర్యాలఅగ్రికల్చర్: వాతావారణం చల్లబడడంతో శ్రమజీవులతో చేనుచెలక కళకళలాడుతోంది. వర్షాలతో రైతులు, వ్యవసాయ కూలీలకు చేతినిండా పనిదొరికింది. పొద్దున్నే చద్దిచేతబట్టుకొని చేనుబాట పడుతున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుముఖం పడుతాయి. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 23.2 మిల్లీమీటర్ల వర్షపాతం



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం వరకు 23.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెన్నూర్ మండలంలో 54.3 మిల్లీమీటర్లు, కాసిపేటలో 49.2, భీమారంలో 46.5, కోటపల్లిలో 43.3, మందమర్రిలో 34.4, జైపూర్‌లో 33.7, బెల్లంపల్లిలో 30.6, జన్నారంలో 26.8, దండేపల్లిలో 22.5, నస్పూర్‌లో 17.3, నెన్నెలలో 12.8, వేమనపల్లిలో 10.7, మంచిర్యాల 10.1, కన్నెపెల్లిలో 8.6, తాండూర్‌లో 5.6, భీమినిలో 4.2, లక్సెట్టిపేటలో 1.4, హాజీపూర్‌లో 5.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు జిల్లా సాధారణ వర్షపాతం 118 మిల్లీమీటర్లు కాగా 34.4 మిల్లీమీ టర్ల వర్షం కురిసింది. ఇంకా జిల్లా సగటున 71 శాతం లోటుగా నెలకొంది.

మోకాలి చిప్ప మార్పిడిపై శిక్షణ



శిక్షణ పొందుతున్న ఆర్థో వైద్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యులకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల అనాటమీ లెక్చరర్ హాల్‌లో మోకాలిచిప్ప మార్పిడిపై శిక్షణ ఇచ్చారు. మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు త్వరలోనే ప్రారంభించనుండగా, వైద్యులకు వర్క్‌షాప్ నిర్వహించారు. మోకాళ్లకు సంబంధించిన జాయింట్ రిప్లేస్‌మెంట్ కోసం ఆర్థోప్లాస్టీ కాడవర్ ల్యాబ్ వర్క్‌షాప్ పేరిట ఆర్థో వైద్యులకు మరోసారి వివరించినట్లు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ.సులేమాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చందర్‌రెడ్డి, జితేందర్, ఆర్థో వైద్యులు శ్రీధర్, సంపత్, జయప్రకాశ్, అవినాశ్, బిందు, రమ్యతేజ, సీనియర్ రెసిడెంట్లు జయశ్రీ, వంశీ కళ్యాణ్ పాల్గొన్నారు.

ఘనంగా హ్యాండ్‌బాల్ దినోత్సవ వేడుకలు



క్రీడాకారిణిని సన్మానిస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హాజీపూర్ మండలం వేంపల్లి పద్మావతి గార్డెన్స్‌లో ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంగా అధికారులు, క్రీడా సంఘాల బాధ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. హ్యాండ్‌బాల్ ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా దేశానికి ప్రాతినిధ్యం వహించి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణి మడావి కరీనాను సన్మానించారు. జాతీయ స్థాయిలో పలు క్రీడలకు రెఫరీలుగా వ్యవహరించిన వారికి టీషర్టులు అందజేశారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడాభివృద్ధి అధికారి బొబ్బిలి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు రాంచందర్, రాజేందర్, మారయ్య, కనకయ్య, యాకూబ్, రామయ్య, పేట సంఘం జిల్లా అధ్యక్షుడు బండ మీనారెడ్డి, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి రాజయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలి

భీమిని: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏసీపీ సదయ్య అన్నారు. శుక్రవారం కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి నేరాలైనా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేధించి ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. గ్రామాల్లోని ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని, ఎలాంటి సమాచారమైన ముందస్తుగా తెలిసే విధంగా వ్యవస్థను పటిష్టం చేయాలని తెలిపారు. తాండూర్ సీఐ శ్రీనివాస్, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

రోడ్డెక్కాల్సిందేనా..?



రాస్తారోకో చేస్తున్న రైతులు

- ధాన్యం అమ్మాలన్నా.. నగదు అందాలన్నా..!
- సేకరణ ముగిసింది.. చెల్లింపే మిగిలింది..
- నెలరోజులు గడిచినా నగదు అందలె..
- ఇంకా జమ కావాల్సింది రూ.147.33కోట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగి ధాన్యం అమ్ముకోవడమే కాదు.. ఆ నగదు జమ కావాలన్నా రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ధాన్యం విక్రయించి నెల రోజులు గడిచినా నగదు అందక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అప్పు చెల్లించడానికి, సాగు పెట్టుబడికి నగదు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామ రైతులు శుక్రవారం రాస్తారోకో చేశారు. జిల్లాలో 262 కొనుగోలు కేంద్రాల్లో 1.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ నెల 16వరకు జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లు ముగిసాయి. తరుగు, మిల్లర్ల తిరకాసు, గన్ని సంచులు, లారీల కొరత, అకాల వర్షాలతో అరిగోస పడ్డారు. క్వింటాల్‌కు ఐదు నుంచి పది కిలోల వరకు కోతలు పెట్టారు. ధర్నాలు, ఆందోళనలతో రోడ్డెక్కి ధాన్యం విక్రయించినా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే నగదు జమ చేస్తామని అధికారులు, పాలకులు ప్రకటించినా అమలుకు నోచుకోలేదు. నగదు కోసం మరోసారి ఆందోళనలు చేపట్టాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

ధాన్యం డబ్బుల కోసం రైతుల రాస్తారోకో

దండేపల్లి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 40రోజులు దాటినా నగదు చెల్లించకపోవడంతో ఆగ్రహించిన రైతులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. మండలంలోని లింగాపూర్ గ్రామనికి చెందిన పలువురు రైతులు స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించారు. ఖాతాలో నగదు జమ కాకపోవడంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మితే 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు గొప్పలు చెబుతున్నారని, 40 రోజులు గడుస్తున్నా ఖాతాలో జమ కావడం లేదని ఆరోపించారు. సహకార సంఘం కార్యాలయానికి వెళ్లి అడిగితే మిల్లు ట్యాగింగ్ కాలేదని చెబుతున్నారని అన్నారు. వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్సై ప్రసాద్ రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

నగదు రూ.147.33 కోట్లు పెండింగ్

ఈ సీజన్‌లో 25,088 మంది రైతుల నుంచి 1,80,483.040 టన్నుల ధాన్యం సేకరించారు. ఇందుకు గాను రూ.353,74,67,584 రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. ఇప్పటివరకు 16,578 మందికి గాను రూ.206,41,63,488 ఖాతాల్లో జమైంది. ఇంకా 8,510 మందికి రూ.రూ.147,33,04,096 అందాల్సి ఉంది. బుక్ కీపర్లు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లో అప్‌లోడ్ చేసిన 48 గంటల్లోగా రైతు ఖాతాలో నగదు జమ కావాల్సి ఉంటుంది. కానీ నెల గడుస్తున్నా డబ్బులు అందక రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ఇప్పటికే వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సాగు పనులు చేపట్టారు. నగదు అందని రైతులు ఇంకెప్పుడు చెల్లింపులు చేస్తారోనని ఆందోళనలో ఉన్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచే డబ్బులు రాలేదని, జమ అయిన వరకు రైతులకు బదిలీ చేశామని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

నెలరోజులు దాటింది..



ధాన్యం విక్రయించి నెల రోజులు దాటింది. అయినా డబ్బులు ఖాతాలో జమ కాలేదు. 239 బస్తాలు తూకం వేసినా డబ్బుల చెల్లింపు లేకపోవడం దారుణం. రెండు రోజులలో పడుతయని చెప్పి నెల రోజులుగా తిప్పుతున్నారు. సెంటర్ నిర్వాహకులను అడిగితే మిల్లు ట్యాగింగ్ కాలేదని చెబుతున్నారు. వానాకాలం సాగు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు చేతిలో పైసలు లేక తిప్పలు పడుడు అయితంది.

– రైతు శివలాల్, గ్రామం: లింగపూర్, మం:దండేపల్లి

మోదీ పాలనలో అగ్రస్థానంలో దేశం



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల, నాయకులు

- కేంద్రమంత్రి పరుషోత్తం రూపాల
- మండలాల్లో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం

జన్నారం: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అగ్రస్థానంలో నిలిచిందని, అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేలా పథకాలు ప్రవేశపెట్టారని కేంద్ర పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి పరుషోత్తం రూపాల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ జెండా ఎగురవేసి ఇంటింటా బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు దుకాణాలకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల క్షేమం కోరుతూ ప్రధాని అనేక పథకాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఉమ్మడి జిల్లా ప్రభారి, పార్లమెంటరీ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మండల అధ్యక్షుడు గోలి చందు, రాష్ట్రకమిటీ సభ్యుడు హరినాయక్, జెడ్పీటీసీ జానుబాయి, ఎంపీటీసీ కొంతం శంకరయ్య, హరిణి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

మంచిర్యాలటౌన్: పేదల సంక్షేమానికే మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్రమంత్రి పరుషోత్తం రూపాల అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంచిర్యాలలోని శ్రీనివాస్ టాకీస్ ఏరియాలో దుకాణాలకు వెళ్లి వ్యాపారులతో మాట్లాడారు. చిరు వ్యాపారుల కోసం గత తొమ్మిదేళ్లుగా ప్రధాని తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన పథకాలు వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఇంచార్జి పల్లె గంగారెడ్డి, పెద్దపల్లి పురుషోత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీశ్ జైన్, ఆకుల అశోక్ వర్ధన్, బోయిని హరికృష్ణ, పూదరి రమేశ్ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడిన కేంద్ర మంత్రి

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో పత్తి పంట సాగు చేస్తున్న రైతులతో కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల మాట్లాడారు. మంచిర్యాల నుంచి ఉట్నూర్ వెళ్తున్న ఆయన గ్రామ శివారులోని రైతులతో కొద్ది సేపు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైతుల కోసం కిసాన్ సమృద్ధి యోజన ద్వారా కేంద్రం సంవత్సరానికి రూ.6వేలు అందిస్తుందని, సబ్సిడీపై ఎరువులు అందించి రైతులను ఆదుకుంటోందని తెలిపారు.

సికిల్‌సెల్ ఎనిమియాపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు అందరికీ సికిల్‌సెల్ ఎనిమియా(సికిల్‌సెల్ రక్తహీనత)పై పూర్తి అవగాహన ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం మందమర్రి, కాసిపేట, దండేపల్లి, తాళ్లపేట్ వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ల్యాబ్ టెక్నీషియన్లు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలకు సికిల్‌సెల్ ఎనిమియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో 40 ఏళ్ల వయస్సు ఉన్న వారికి స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని, సుమారుగా 18,436 మందికి పరీక్షలు అవసరం అవుతాయని అన్నారు. మొదటి విడతలో 4,396 మంది విద్యార్థులకు పరీక్షలు చేయాలని, ఇప్పటికే జిల్లాకు 3,200 టెస్టింగ్ కిట్లు వచ్చాయని అన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రైమరీ స్కూళ్లు 45, యూపీఎస్ 5, హైస్కూల్‌లో 17 ఉండగా, 4,396 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరికీ 27 నుంచి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికిల్‌సెల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఫయాజ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శారదాదేవి, డాక్టర్ అన్వేష్, ఎల్‌టీ రమేశ్, డీపీవో ప్రశాంత్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాలలో ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఐబీ చౌరస్తా నుంచి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు పరుగు సాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి రాంచందర్, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, హ్యాండ్‌బాల్ సెక్రెటరీ రమేశ్, మారయ్య, యాకుబ్, రామయ్య, పెంచాల శ్రీధర్, మీనారెడ్డి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆగని ‘నకిలీ’ దందా!

కాసిపేటలో ఓ వ్యాపారి పెద్ద ఎత్తున నకిలీ(బీజీ3 హెచ్‌టీ) పత్తి విత్తనాల దందా సాగిస్తున్నారు. గత రెండు రోజుల్లోనే 50కిలోల విత్తనాలను పలు గ్రామాల రైతులకు అమ్మినట్లు సమాచారం. గతంలో అనుమతి లేని పత్తి విత్తనాలు తెస్తూ పట్టుబడిన వారే ఈ సీజన్‌లోనూ దందా కొనసాగించడం గమనార్హం. ఇందులో రెండు మూడు కేసులు నమోదై బెయిల్‌పై వచ్చిన వారే ఉన్నారు. సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఫోన్లు చేసి విత్తనాలు ఉన్నాయని అమ్ముతున్నారు. కొన్ని చోట్ల భయంతో కొనుగోలు చేయడం లేదు.



- వర్షాలు కురవడంతో రవాణా
- కాసిపేటలో ఓ వ్యాపారి విక్రయాలు
- కొన్ని చోట్ల అవే విత్తనాలు వేస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నకిలీ పత్తి విత్తనాల దందా గుట్టుగా సాగుతూనే ఉంది. ఈ దందాలో ఆరితేరిన కొందరు పట్టుబడి పోలీసుస్టేషన్లలో కేసులు నమోదైనప్పటికీ బెయిల్‌పై బయటకు వస్తామని ధీమాతో ఉన్నారు. గత రెండు రోజులుగా జిల్లాలో వానలు కురుస్తుండడంతో రైతులు పత్తి విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులతో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినా ఈ అక్రమ రవాణా నిలువరించడం లేదు. గతంలో పీడీ యాక్టుతో కొంత భయపడినా మళ్లీ యథాస్థితికి వచ్చింది. కొందరు విత్తన డీలర్లు, ఎరువుల అమ్మకాలు చేసే ఏజెంట్లు, మార్కెటింగ్ చేసే వారంతా ఈ దందాలో చేతులు కలుపుతున్నారు. కంపెనీ లోగోతో ఉండే విత్తనాల ప్యాకెట్లలోనే గుర్తింపు లేని విత్తనాలను రవాణా చేస్తున్నారు. ప్యాకెట్లలోనే విక్రయాలు చేస్తున్నారు. కాసిపేట, తాండూరు, బెల్లంపల్లి, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల గ్రామాల్లోనే అధికంగా ఈ విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది.

దొరికితే రైతులపై నెట్టేస్తూ..

నకిలీ విత్తనాలు చాలా కేసుల్లో దర్యాప్తుల్లో అసలు సూత్రధారులు, కంపెనీ, తయారీ చేసే ఫ్యాక్టరీ వరకు వెళ్లడం లేదు. మధ్యవర్తులు, కొనుగోలు చేసి డంప్ చేసుకున్న వారితోనే కేసుల విచారణ ఆగిపోతోంది. గతంలో ఓసారి ఇక్కడి నుంచి ఓ పోలీసు బృందం కర్నూల్, మహబూబ్‌నగర్, గుంటూరు తదితర ప్రాంతాల వరకు వెళ్లి విచారణ చేపట్టారు. అయితే చాలా కేసుల్లో కొనుగోలు చేసిన రైతులపైనా కేసులను నెట్టేస్తున్నారు. విత్తన మాఫియా తమ వరకు కేసులు రాకుండా ఎక్కడికక్కడ దర్యాప్తులో తమ పేర్లు బయటపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పలు ప్రాంతాలకు రవాణా చేస్తూ బహిర్గతం కాకుండా చూస్తున్నారు. ప్రస్తుతం వానలు పడుతుండడంతో కొన్ని చోట్ల రైతులు అంతా తెలిసీ కూడా నిషేధిత బీజీ3(హెచ్‌టీ) పత్తి విత్తనాలు విత్తుతున్నారు. మొలకెత్తాక కలుపు బాధ తప్పుతుందనే ఈ విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. విత్తనం వేస్తే భూసారం, మానవ, జంతు జాలానికి జరుగుతున్న ముప్పుపై ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో ఈ విత్తనాలు ఇప్పటికే చాలా రైతుల ఇళ్లలోకి చేరిపోయాయి. ఇంకా ఎవరైనా తీసుకోవాల్సి ఉంటే ఫోన్లు చేసి విత్తనాలు ఉన్నాయి, కొనుగోలు చేయండని కోరుతున్నట్లు సమాచారం. వ్యవసాయ అధికారులు ఈ విత్తనాలపై మరింత వివరంగా రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన పెంచాల్సి ఉంది.

ముగిసిన ఓటరు సర్వే

- పొరపాట్ల సవరణ, మృతుల పేర్ల తొలగింపు
- రోజుకు 150 ఇళ్లు సర్వే చేసిన బీఎల్‌వోలు
- తుది జాబితాకు కసరత్తు



మంచిర్యాలలో సర్వే చేస్తున్న బీఎల్‌వోలు

మంచిర్యాలటౌన్: ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణ, మృతుల పేర్ల తొలగింపు, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా, పొరపాట్లు లేకుండా పూర్తి పారదర్శకంగా జాబితాను సిద్ధం చేసేందుకు ఎన్నికల సంఘం జిల్లాలో ఇంటింటా ఓటరు సర్వే నిర్వహించింది. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలోని వివరాలు పరిశీలించి, పొరపాట్లను సరిదిద్దడంతోపాటు, మృతుల, బోగస్ ఓట్లను తొలగించారు. శుక్రవారంతో ఇంటింటి సర్వే పూర్తి కాగా, తొలగించిన వివరాలను జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించారు. ప్రతీ ఓటరు ఇంటి నంబరును కచ్చితంగా వేయడంతోపాటు ఒకే ఇంటి నంబరు ఇస్తే వారు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా జాబితా సిద్ధం చేస్తున్నారు. ఓటర్ల సవరణలు, కొత్త పేర్ల నమోదు, మృతుల పేర్ల తొలగింపు, ఇళ్లు మారిన వారి చిరునామాలను మార్పు చేయడం వంటివి చేసి, అక్టోబర్ 5న ఓటర్ల తుది జాబితా ప్రకటించేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది.

పూర్తి పారదర్శకంగా ఉండేలా...

బోగస్, డబుల్ ఓట్ల తొలగింపునకు ఎన్నికల సంఘం పలు చర్యలు చేపడుతోంది. ఆధార్ అనుసంధానంతో డబుల్ ఓట్లను గుర్తించడం వంటి కార్యక్రమాలను చేపట్టినా, మరికొద్ది నెలల్లోనే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీంతో గత కొద్ది రోజులుగా ఇంటి నంబర్ల ఆధారంగా ఓటరు జాబితాను సర్వే చేశారు. ఓటర్ల జాబితాను అనుసరించి ప్రతీ పోలింగ్ కేంద్రంలో 1,500 మంది ఓటర్లకు మించకుండా ఉండేలా జూలై 27వరకు పోలింగ్ కేంద్రాలను క్రమబద్ధీకరించడం, జూలై 31వరకు ఓటరు జాబితాకు సంబంధించిన సప్లిమెంట్స్ ప్రక్రియ చేపట్టనున్నారు. సర్వే సమయంలోనే ఓటర్ల జాబితాలో పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఎంత మంది ఉన్నారనే వివరాలన్నీ క్రోడీకరించారు. మంచిర్యాల నియోజకవర్గంలో 152 మంది సవరణలు, 267 మంది మృతి, 62 మంది ఇతర చోటుకు వెళ్లినట్లుగా గుర్తించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో 521 మంది సవరణలు, 560 మంది మృతులు, 464 మంది ఇతర చోటుకు వెళ్లిపోయిన వారిని గుర్తించారు. చెన్నూరు నియోజకవర్గంలో 152 మంది సవరణలు చేయగా, 267 మంది మృతి, 62 మంది ఇతర చోటుకు వెళ్లిపోయిన వారిని గుర్తించారు.

జిల్లాలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	మొత్తం ఇళ్లు
మంచిర్యాల	279	2,48,734	1,09,448
బెల్లంపల్లి	222	1,61,495	62,629
చెన్నూరు	225	1,76,973	70,277
మొత్తం	726	5,87,202	2,42,354



సారూ.. పీటీఐలపై ఇదేం తీరు..!

- పునర్నియామకంలో తీవ్ర జాప్యం
- వేతనాలు కోల్పోతున్న వైనం



విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పుతున్న పీటీఐ(ఫైల్)

కాసిపేట: జిల్లాలో విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుతో జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న పీటీఐ(పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు) నష్టపోవాల్సి వస్తోంది. పునర్నియామకంలో జాప్యం కారణంగా ప్రతీ ఏడాది 10 రోజుల నుంచి 40 రోజుల వరకు వేతనం కోల్పోవాల్సి వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో పనిచేస్తున్న పీటీఐలను ప్రభుత్వం ప్రతీ విద్యా సంవత్సరం చివరి పనిదినం రోజున తొలగించి మళ్లీ నియమిస్తుంది. ప్రభుత్వ ఆదేశానుసారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్లు ప్రతీ ఏడాది వీరికి రీ ఎంగేజ్ ఆర్డర్ ఇవ్వగానే అన్ని జిల్లాల్లో పీటీఐలు విధులకు హాజరవుతూ వారి వారి పాఠశాలల ద్వారా సంబంధిత పత్రాలు డీఈవో కార్యాలయానికి పంపిస్తారు. జిల్లాలో కమిషనర్, పీడీ ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. నాలుగేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. కలెక్టర్ అప్రూవల్ అయ్యాక స్కూళ్లకు వెళ్లాలని చెబుతూ ఫైల్‌ను ప్రతీ ఏడాది 10 నుంచి 40రోజులు ఆలస్యం చేస్తుండడంతో వేతనాలు కోల్పోతున్నారు. ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ విభాగంలో జిల్లాలో మొత్తం 69మంది పీటీఐలుగా పనిచేస్తున్నారు. వీరికి వేతనం నెలకు రూ. 11,700 చెల్లిస్తున్నారు. పీటీఐలను కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారిని సంప్రదించగా.. కలెక్టర్ అప్రూవల్ అయ్యాక విధుల్లోకి తీసుకుంటామని, మిగతా జిల్లాల విషయం తమకు తెలియదని అన్నారు.

క్లుప్తంగా

రికార్డులు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎల్‌ఈవో

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఎస్ అండ్ పీసీ కార్యాలయాన్ని శుక్రవారం లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ (ఎల్‌ఈవో) శంకర్‌రావు పరిశీలించారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ నగునూరి రవిని అడిగి వారి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సీనియర్ సెక్యూరిటీ ఇన్స్‌పెక్టర్ సుంకరి రమేష్, జూనియర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్, జమేదార్ నారాయణ, ఆఫీస్ సిబ్బంది ఎల్‌ఈవోను ఘనంగా సన్మానించారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

జన్నారం: కులం పేరుతో దూషించిన ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాల ప్రకారం... ఈ నెల 8న జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన శ్రీపెల్లి లక్ష్మణ్‌ను అదే గ్రామానికి చెందిన రుక్మి ప్రసాద్ కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్రసాద్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అదే విధంగా ప్రసాద్‌పై దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

జైపూర్: పల్లెల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లు ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తూ ఎక్కడా చెత్తా, ప్లాస్టిక్ లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్ గ్రామ పంచాయతీలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్లు, మురికాలవలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఎంపీవో అనిల్‌కుమార్, సర్పంచ్‌లు దుగుట జ్యోతి, వెంకటేశ్వర్‌గౌడ్, కుంటాల సౌజన్య, కార్యదర్శులు సురేశ్, సురేందర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు డ్రోన్ పిచికారీపై అవగాహన సదస్సు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శనివారం డ్రోన్‌ల ద్వారా పురుగుల మందు పిచికారీపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.రాజేశ్వర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కేవీకే ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. డ్రోన్‌ల ద్వారా ఏ తీరుగా పురుగుల మందు పిచికారీ చేయవచ్చో వివరిస్తామని, ఆసక్తి కలిగిన రైతులు హాజరు కావాలని కోరారు.

పర్యాటకులకు చేరువగా...

- మూడు సఫారీలు – ఆరు కార్టేజీలు
- పర్యాటక రంగం అభివృద్ధిపై అటవీశాఖ దృష్టి
- జన్నారం రానున్న కొత్త సఫారీలు
- కార్టేజీ పనులు ప్రారంభం

జన్నారం: అటవీశాఖ పర్యాటక రంగ అభివృద్ధిపై దృష్టి సారించింది. రోజురోజుకూ జన్నారంకు పర్యటకుల సంఖ్య పెరుగుతుండడంతో పర్యటకులకు సౌకర్యం కల్పించేందుకు అటవీశాఖ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా జన్నారం అటవి డివిజన్‌లో నూతనంగా ఆరు కార్టేజీల నిర్మాణం కోసం పనులు ప్రారంభించింది. అదే విధంగా మరో మూడు సఫారీలు తీసుకురానుంది.

రూ.50లక్షలతో కార్టేజీల పనులు ప్రారంభం

జన్నారం మండలంలో ఇదివరకే పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పర్యటకుల కోసం 11 కార్టేజీల నిర్మాణం చేసి రెండు సఫారీలు ఏర్పాటు చేశారు. పర్యాటకుల సంఖ్య పెరగడంతో గదుల కోసం, సఫారీ ప్రయాణం కోసం పోటీ పెరిగింది. ఈ క్రమంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలని యోచించింది. ఈ క్రమంలో ఎఫ్‌డీవో మాధవరావు ఈ విషయం పీసీసీఎఫ్ డోబ్రీయాల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఇందుకు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో జన్నారం మండలం పోలీస్‌స్టేషన్ సమీపంలోని పాడైనా క్వార్టర్లను కూల్చి నూతనంగా కార్టేజీల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఇందుకు రూ.50లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.



నూతనంగా నిర్మించనున్న కార్టేజీల కోసం కేటాయించిన స్థలం

కార్టేజీలతో పాటు...

అటవీశాఖ స్థలంలో కార్టేజీలతో పాటుగా మరికొన్ని సౌకర్యాలు కల్పించేందుకు అటవీశాఖ అధికారులు యోచిస్తున్నారు. ముందుగా ఆరు కార్టేజీలు, ఒక డైనింగ్ హాలు, రిసెప్షనిస్టు గది, షాపింగ్‌మాల్ కూడా ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నారులను ఆకట్టుకునే విధంగా, పెద్దలు ఆహ్లాదం పొందేలా తగు ఏర్పాట్లు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశారు.

పెరిగిన రెండు ట్రాక్‌లు

ఇప్పటి వరకు పర్యాటకులు అడవిలో పర్యటించేందుకు ఒక ట్రాక్ మాత్రమే ఉంది. డివిజన్‌లోని గేట్ నంబర్ 1 నుంచి బైసన్‌కుంట, గొండుగూడ బేస్‌క్యాంప్, నీలుగాయికుంట ప్రాంతాల్లో 15కిలో మీటర్ల దూరంలో జంగిల్ సఫారీల ద్వారా ప్రయాణం చేస్తారు. కానీ వచ్చే అక్టోబర్ మాసం నుంచి పర్యటకుల కోసం మరో రెండు ట్రాక్‌లు పెంచుతున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. చింతగూడ అటవీ ప్రాంతం నుంచి తాళ్లపేట్ వరకూ ఒక ట్రాక్, ఇందన్‌పల్లి రేంజ్‌లోని గేట్ నంబర్ 5 నుంచి మైసమ్మకుంట, ఘనిషెట్టికుంట, కల్పకుంట వరకూ మరో ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

మరో మూడు సఫారీలు...

పర్యటకుల సంఖ్య పెరుగుతుండడంతో సఫారీల కోసం పర్యటకులు ఎదురు చూడకుండా అటవీశాఖ ఆధ్వర్యంలో కొత్తగా సఫారీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇదివరకే పర్యటకశాఖ నుంచి రెండు జంగిల్ సఫారీలు, అటవీశాఖ నుంచి రెండు జంగిల్ సఫారీలున్నాయి. వీటితో పాటుగా మరో మూడు పెద్ద సఫారీలు తీసుకురానున్నారు. నిర్మల్‌లో మొత్తం ఐదు సఫారీలను అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించగా అందులో మూడు సఫారీలు ఇక్కడికి తీసుకువస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. కొత్తగా తీసుకువచ్చే సఫారీల కెపాసిటీ పెద్దగా ఉండడమే కాకుండా పైనా కప్పు ఉంది. వర్షం వచ్చిన ఇబ్బంది లేకుండా ఉంటుంది.

అక్టోబర్ వరకు పూర్తి

పర్యాటకుల సంఖ్య పెరగడంతో అటవీశాఖ నుంచి పర్యటక రంగ అభివృద్ధి కోసం నూతనంగా కార్టేజీలు నిర్మించాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈసీ ఎదురుగా గల అటవీశాఖ స్థలంలో రూ.50లక్షలతో కార్టేజీల నిర్మాణం చేపడుతాం. అక్కడే సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. అదే విధంగా జంగిల్ సఫారీల సంఖ్య కూడా పెంచుతున్నాం. ట్రాక్‌లు పెంచుతున్నాం. దీంతో పర్యాటకులు ఆహ్లాదం పొందుతారు.

– సిరిపురం మాధవరావు, డెప్యూటీ కన్జర్వేటర్

రక్షణ బాధ్యతగా భావించాలి



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం గుప్తా

శ్రీరాంపూర్: ప్రతీ ఉద్యోగి గనుల్లో రక్షణ చర్యలను బాధ్యతగా భావించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ సీఎం కేహెచ్‌ఎన్ గుప్తా తెలిపారు. శుక్రవారం ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా రక్షణ నా బాధ్యత అనే నినాదంతో ప్రతీ ఉద్యోగి పని చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్షణ సూత్రాలను పాటించి పనిచేయాలన్నారు. ఇంటా, బయట ఎక్కడికి వెళ్లినా కూడా మన ప్రాణాలను రక్షించుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, ఏజెంట్ గోపాల్ సింగ్ మేనేజర్ సంతోష్ కుమార్, సిమ్‌టూర్ సెంటర్ ఇన్‌చార్జి జి.విజయ్‌కుమార్, అడిషనల్ మేనేజర్ శ్రీధర్‌రావు, సేఫ్టీ అధికారి మహేందర్, సెక్రెటరీ గోపాల్ ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన స్పాట్‌వాల్యూయేషన్ ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని డీఐఈవో శైలజ తెలిపారు. ఫిజిక్స్, ఎకానమిక్స్, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల సంబంధించిన అధ్యాపకులు కళాశాలలో రిలీవ్ అయి ఆర్డర్‌కాపీతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు రిపోర్టు చేయని ఎగ్జామినర్‌కు జరిమానా విధిస్తామని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడాలి

- జీఎం సంజీవరెడ్డి
- డిస్పెన్సరీలో స్వచ్ఛతా పక్వాడా

శ్రీరాంపూర్: పర్యావరణాన్ని కాపాడాలని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం నస్పూర్ కాలనీలోని సింగరేణి డిస్పెన్సర్ లో స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం అధికారులతో కలిసి చీపురు పట్టి చెత్తాచెదారం శుభ్రం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తాను పనిచేసే చోట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చాలా వ్యాధులకు అపరిశుభ్ర వాతావరణమే కారణమన్నారు. ఈ నెల 16 నుంచి 30వరకు గనుల్లో స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పర్యావరణంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు జీఎం చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, డీజీఎం పర్సనల్ అరవింద్ రావు మెడికల్ సూపరిండెంట్లు మురళీధర్ లోక్నాథ్ రెడ్డి సెక్రటరీ ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చెత్తను శుభ్రం చేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్ ఓసీపీలో...

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలరీ మేనేజర్ సుధీర్ పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజినీర్ చంద్రశేఖర్, రక్షణ అధికారి శ్రీనివాస్, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాంసుందర్, సంక్షేమ అధికారి శంకర్, ఫిట్ సెక్రెటరీ కందుల శంకరయ్య పాల్గొన్నారు.

డెప్యూటీ సీఎల్సీకి వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులను కలిసి వినతిపత్రం శుక్రవారం అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆంతోటి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కనుకుల తిరుపతి కలిశారు. సింగరేణి గుర్తింపు సంఘం కాలపరిమితి నాలుగు సంవత్సరాలు ఉండాలని కోరారు. 7వ దఫా నిర్వహించే ఎన్నికల్లో ముందు వెలువరించే షెడ్యూల్లోనే ఈ కాలపరమితిని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి జిమ్మిడి మల్లేష్, నాయకులు కారుకూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు మూడు డిగ్రీ గురుకులాలు

కౌటాల(సిర్పూర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కొత్తగా మూడు బీసీ డిగ్రీ గురుకులాల ఏర్పాటుకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మాజ్యోతి పూలే గురుకులాల డిగ్రీ కళాశాలలను ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శి బీ వెంకటేశం ప్రకటించారు. దీంతో ఆయా జిల్లాలోని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో మూడు గేదెలు మృతి

కాసిపేట: మండలంలోని కోమటిచేను శివారులోని పంట చేన్లలో తెగిపడిన విద్యుత్ వైర్లు మూడు గేదెలు మృతి చెందాయి. వివరాల ప్రకారం... గురువారం అర్ధరాత్రి వీచిన గాలివానకు విద్యుత్ వైర్లు తెగిపడిపోవడంతో శుక్రవారం ఆ వైపు వెళ్లిన మూడు గేదెలు మృతిచెందాయి. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఈ స్వర్ణలత తెలిపారు. ఇప్పటి వరకు మృతిచెందిన గేదెలు ఎవరివో తెలియరాలేదు.

మేధావులపై ఉపా చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

బెల్లంపల్లి: రాష్ట్రంలోని మేధావులపై అక్రమంగా పెట్టిన ఉపా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములు సాగు చేస్తున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. దండేపల్లి మండలంలోని కోయ పోచగూడెం ఆదివాసీలను విస్మరించవద్దన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు ఉద్యమించాలి

జన్నారం: బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడానికి బీఆర్ఎస్ పార్టీ ఉద్యమించాలని బీసీ కులాల పోరాట సమితి కరీంనగర్ జోనల్ కన్వీనర్ కేపే నర్సింహులు, ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం బీసీ కులాల రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో గళం విప్పాలని కోరారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు గంగయ్య, జిల్లా కోకన్వీనర్లు లక్ష్మి ఉన్నారు.

షాపును ధ్వంసం చేసిన మహిళలపై కేసు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడో జోన్‌లో పలు కిరాణ షాపుల్లో మద్యం అమ్ముతున్నారని చొరబడి ధ్వంసం చేశారని షాపుల నిర్వాహకుల ఫిర్యాదు మేరకు రామిల్ల రాధిక, బత్తుల సరితతో పాటు మరికొందరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం మూడో జోన్‌లోని పలువురి కిరాణ షాపుల్లో మద్యం అమ్ముతున్నారనే అనుమానంతో రాధిక, సరిత మరికొందరు మహిళలతో అక్రమంగా చొరబడి షాపులను ధ్వంసం చేశారు. షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉంటే రాధిక మాట్లాడుతూ అక్రమంగా కాలనీలోని దుకాణాల్లో మద్యం విక్రయిస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారనే సమాచారం మేరకు పలు షాపులోని మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో మహిళా నాయకులు

కెకె ఓసీలో కొనసాగుతున్న కార్మికుల సమ్మె

కాసిపేట: సమస్యలు పరిష్కరించి కంపెనీ వేరే చోట చెల్లిస్తున్న విధంగా తమకు వేతనాలు చెల్లించాలని కెకె ఓసీ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఆర్‌వీఆర్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్లు తమకు అన్యాయం చేస్తున్నారని గురువారం సమ్మెకు దిగారు. శుక్రవారం మందమర్రి జీఎం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కెకె ఓసీ పీవో కార్యాలయంలో చర్చలు జరిపారు. జూలై 1వ తేదీలోగా సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కారిస్తామని చెప్పడంతో ఇప్పటికే మూడు నెలల వేతనాలు నష్టపోయామని వెంటనే హామీ ఇచ్చి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలీసులు, అధికారుల ఒత్తిడి చేసిన కార్మికులు ఒప్పుకోకపోవడంతో సమ్మె యథావిధిగా కొనసాగింది.



కెకె ఓసీలో సమ్మె చేస్తున్న కార్మికులు

పనులు పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి చేయాలి

చెన్నూర్‌రూరల్: సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, సోలార్ ప్లాంట్ జనరల్ మేనేజర్ జానకిరామ్‌లు సూచించారు. మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలోని మూతబడ్డ గని ఆవరణలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. చెన్నూర్ 2 ఇంక్లెన్ గని ఆవరణలో 11 మోగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని, గని ఆవరణలో నిర్మించిన కంపౌడ్ వాల్ పనులను పరిశీలించారు. వారి వెంట ఏరియా ఇంజినీర్ జి.రమేష్‌బాబు, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం శ్రీనివాస్, సోలార్ ఎస్ఈ అప్పారావు, ఏరియా వర్క్ షాప్ ఈఈ రాకేష్, సోలార్ ఎనర్జీ ఎన్రిచ్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాసరావు, మధన్‌మోహన్ రెడ్డి ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న జనరల్ మేనేజర్లు

'ఎమ్మెల్సీని కఠినంగా శిక్షించాలి'

పాతమంచిర్యాల: ముదిరాజ్‌లను కించపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు తూటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం హుజూరాబాద్‌లో అమరవీరుల స్తూపం వద్ద జరిగిన గొడవలో ముదిరాజ్ కులానికి చెందిన సోషల్ మీడియా రిపోర్టర్‌ను బంధించి చిత్రహింసలకు గురిచేసి కులం పేరుతో బూతులు తిడుతూ ముదిరాజ్ కులస్తులను అవమానకరంగా మాట్లాడాడన్నారు. ముదిరాజ్‌లను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రాజు, నాయకులు కొలిపాక తిరుపతి, కనుకుట్ల శ్రీనివాస్, తిరుపతి, మల్లేష్, నవీన్, సూరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు తూటి శ్రీనివాస్

పోలీస్‌స్టేషన్‌లో ఆ జేసీబీ ఏమైంది..!

- పోలీస్ వర్గాలను కుదిపేస్తున్న జేసీబీ తరలింపు
- గుప్త నిధుల తవ్వకాల్లో సీజ్.. రిలీజ్ చేయడంపై అనుమానాలు
- పోలీసు ఉన్నతాధికారుల సీరియస్

జైపూర్: జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో జేసీబీ తరలింపు అంశం ఇప్పుడు పోలీస్ వర్గాలను కుదిపేస్తోంది. గుప్త నిధుల తవ్వకాల్లో సీజ్ చేసిన వాహనాన్ని కోర్టు నుంచి ఎలాంటి రిలీజింగ్ అనుమతి లేకుండానే సదరు వ్యక్తికి ఆ జేసీబీసీ అప్పగించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. భీమారం మండలం పోలంపల్లి మాంతమ్మ గుడి సమీపంలో 2018లో గుప్త నిధుల తవ్వకాల కేసులో పోలీసులు జేసీబీ, బైక్‌ను సీజ్ చేసి కోర్టుకు అప్పగించారు. కేసు కొనసాగుతుండగా భీమారం పోలీస్‌స్టేషన్‌లో స్థలం లేక రక్షణ నిమిత్తం జేసీబీని జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. గత ఏడాది జైపూర్ పోలీస్‌స్టేషన్‌లోని క్వార్టర్లు, ఎస్సై నివాస గృహం, పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని కూల్చివేశారు. అదే సమయంలో ఇక్కడ ఉన్న జేసీబీని సదరు వ్యక్తికి అప్పగించినట్లుగా తెలుస్తోంది. అయితే ఇటీవల భీమారంకు కొత్తగా వచ్చిన ఎస్సై అన్నీ పరిశీలిస్తుండగా సీజ్ చేసిన జేసీబీపై ఆరా తీశారు. ఆ జేసీబీ అక్కడ లేకపోవడంపై పోలీసులు అధికారులు అవాక్కయ్యారు. ఇంతకాలం ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన ఆ సీనియర్ ఎస్సై సీజ్ చేసి కోర్టులో కేసు నడుస్తున్న క్రమంలో ఎలాంటి రిలీజింగ్ ఆర్డర్ లేకుండా జేసీబీని అప్పగించడంపై పెద్ద ఎత్తున్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీజ్ చేసిన జేసీబీ హర్యాన రాష్ట్రానికి చెందినట్లుగా తెలుస్తోంది. ఈ అంశంపై విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. కోర్టు కేసులో ఉన్న చిన్నచిన్న వాహనాలనే రిలీజ్ చేయడానికి ఆలోచించే పోలీసులు ఇంత సులువుగా జేసీబీని ఉన్నతాధికారుల కంట చిక్కకుండా స్టేషన్ దాటించడం చర్చనీయాంశంగా మారుతోంది.

పురుషోత్తమ భారతీస్వామికి ఘన స్వాగతం

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానానికి విచ్చేసిన శృంగేరి శివగంగ పీఠాధిపతి, జగద్గురు పురుషోత్తమ భారతీస్వామికి శుక్రవారం రాత్రి భక్తులు ఘన స్వాగతం పలికారు. కర్ణాటక నుంచి కాశీ వరకు వెళ్తూ మార్గమధ్యలో కొన్ని ఆలయాలు సందర్శిస్తున్నారు. అందులో భాగంగా మంచిర్యాలకు వచ్చిన పురుషోత్తమ భారతీస్వామి ప్రవచనాలు వినిపించారు. శనివారం ఉదయం 9గంటల నుంచి భక్తులకు దర్శనం, పాదపూజలు, బిక్షవందనం, శారదా చంద్రమౌళీశ్వర పూజల అనంతరం మంచిర్యాల నుంచి తిరిగి కాశికి బయలుదేరి వెళ్లనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ముక్తారవి, అర్చకుడు బాలకృష్ణ పాల్గొన్నారు.



భారతీస్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారం గ్రామానికి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఈ నెల 21న రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. కుటుంబీకులు రెండు రోజుల పాటు తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో శుక్రవారం ఆమె భర్త స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున దోమలు వృద్ధి చెందకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత అన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు పెరిగేందుకు అవకాశం ఉన్న నీటి నిల్వ లేకుండా చూడాలని, దోమలు వృద్ధి చెందే చోట దోమల మందు పిచికారీ వంటి కార్యక్రమాలను స్థానిక సంస్థలతో కలిసి చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ రాజేందర్ ఒక్క దోమకాటుతో ఎన్ని రకాల వ్యాధులు వస్తాయో వివరించి, రాకుండా తీసుకోవాల్సిన చర్యలు తెలియజేశారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి డాక్టర్ అనిత

సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై సమీక్ష

శ్రీరాంపూర్: చెన్నూర్‌లో మూతపడ్డ 2 ఇంక్లైన్ భూగర్భ గని ఆవరణలో 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి, జీఎం(సోలార్) జానకిరాములు ఏరియా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కొత్త ప్లాంట్‌ను అక్టోబర్ నెలకల్లా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని, పనులు వేగవంతం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు జీఎంలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమేష్‌బాబు, వర్క్‌షాప్ డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(సోలార్) శ్రీనివాస్, ఎస్ఈ(సోలార్) అప్పారావు, సోలార్ ఎనర్జీ ఎంచ్రిచ్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాస రాజు, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.